ఓంశ్రీసాయిరాం

# నేను పుస్తకాన్ని చూడను, మస్తకాన్ని చూస్తాను

ఇక్కడ పనిచేసే పిల్లలందరూ చాలా భక్తి, శ్రద్ధలతో చేస్తున్నారు. పిల్లయొక్క ప్రోద్బలముచేతనే ఈ బుక్ట్రస్టు పెరుగుతూ వచ్చింది. అయితే, పుస్తకములు ప్రధానం కాదు, మస్తకం ప్రధానం. పుస్తకములోనిది మస్తకములో చేర్చి హస్తము ద్వారా ఆచరణలో పెట్టాలి. పుస్తకము, మస్తకము, హస్తము ఈ మూడింటి ఏకత్వానికి కృషిచేయాలి. ఈనాడు ప్రపంచానికి అవసరమైనది సేవ. అందరినీ ప్రేమించాలి, అందరినీ సేవించాలి. ఇదే మనము చేయవలసింది. మనము ఏ పని చేసినా అది దైవసేవగా భావించాలి. పరమాత్ముడు లేని ప్రదేశము ఎక్కడా కనిపించదు. 'ఇందుగలడందులేడని సందేహము వలదు...' God is in you, with you, around you, above you, below you... ఏ ఒక్క పని చేసినా అంతా దైవసంకల్పానుసారమే జరుగుతుందిగానీ, మరొకవిధంగా జరగటానికి వీలులేదు.

*విశాల భావములు పెంపొందించే పుస్తకాలు ప్రింటు చేయాలి*

చూడండి.. ఇది ఒక వస్త్రము. కాని, ఇది వస్త్రము కాదు. దారములయొక్క చేరిక. ఈ దారములు ప్రత్తిచేత తయారౌతున్నాయి. మొట్టమొదటిది ప్రత్తి, రెండవది దారము, మూడవది వస్త్రము. ఈమూడూ చేరి ఒక్కటే. అదేవిధముగా, నీవు ఒక వ్యక్తివి కాదు, నీలో ముగ్గురున్నారు. 1. నీవనుకునే నీవు. 2. ఇతరులనుకునే నీవు 3. అసలైన నీవు. ఒక పుస్తకాన్ని తయారుచేయటంలోకూడా ముగ్గురు వ్యక్తుల ప్రమేయం వుంటుంది. వ్రాసేది ఒకరు, ప్రింటు చేసేది ఒకరు, చదివేది ఒకరు. మీరు ఎన్ని గ్రంథములు ప్రింటుచేస్తున్నారన్నది ప్రధానం కాదు. అవి మంచి పుస్తకాలుగా వుండాలి. విశాలమైన ప్రపంచానికి వుశాలమైన భావాలను అందించే పుస్తకాలు ప్రింటు చేయాలి. సంకుచిత భావములకు చోటివ్వకుండా విశాలమైన భావములను పెంపొందించాలి. అందరికీ అవసరమైన, ఉపయోగకరమైన పుస్తకాలు ప్రింటుచేయాలి. డబ్బు ప్రధానం కాదు, నైతిక విలువలు ప్రధానం. Money comes and goes, morality comes and grows. కాబట్టి, నైతిక విలువలను మనము పెంచుకోవాలి. ఎన్ని పుస్తకాలు వ్రాసినప్పటికీ, మీరు ఎన్ని పుస్తకాలు చదివినప్పటికీ అందులో వున్న మంచి విషయాలలో ఒక్కటైనా ఆచరణలో పెట్టకపోతే అవన్నీ వ్యర్థమే! తట్టలోనున్న పదార్థముల పేర్లు చెప్పినంత మాత్రాన మన పొట్ట నిండదు. ఒక్కటైనా భుజించాలి. అదేరీతిగనే పుస్తకాలు ఎన్నో వున్నాయి. స్వామియొక్క విషయాలు అనేకంగా వ్రాస్తున్నారు. కాని, అందులో ఒక్కటైనా మీరు ఆచరణలో పెడుతున్నారా? లేదు. ఆచరణ లేకుండా పుస్తకాలు చదివిన ప్రయోజనము ఏమిటి? పది విషయాలు మీరు వింటే ఒక్కటైనా ఆచరణలో పెట్టాలి. అప్పుడే మీకు తగిన బలము, శక్తిసామర్థ్యములు చేకూరుతాయి.

బుక్ట్రస్టు అభివృద్ధికోసం రాజన్ చాలా అవస్థ పడుతున్నాడు. అనేక రకములైనటువంటి ప్రయత్నాలు చేస్తున్నాడు. తన వయస్సుకు మించిన పని చేస్తున్నాడు. ఇక్కడ పనిచేస్తున్న పిల్లలనుకూడా తగిన మంచి అనుకూలమైన వాతావరణంలో పెడుతున్నాడు. ఎక్కడైనా సరే, 'కోపరేషన్' వున్నప్పుడే తగిన ఫలితము వస్తుంది. ఈ 'కోపరే'న్' అనేది ఎట్లా వుండాలి? హృదయానికి, హృదయానికి మధ్య సంబంధము కలిగించేదిగా వుండాలి. అంతే కాకుండా, దానిని మానసికంగా చక్కగా అర్థం చేసుకోవాలి.

*ఏకత్వాన్ని, పవిత్రతను పెంచుకోవాలి*

All are one, be alike to every one. అందరూ ఒక్కటిగా వుండాలి. పుస్తకాన్ని ఒకరు ప్రింటు చేయవచ్చు. ఒకరు బైండ్ చేయవచ్చు. ఒకరు పోస్ట్ చేయవచ్చు. ఎవరేది చేసినప్పటికీ అందరూ చేరి ఒక్కటే. అందరూ ఏకమైనప్పుడే మనస్సుకు తగిన శాంతి కలుగుతుంది. 'యూనిటీ' వున్నప్పుడే 'ప్యూరిటీ' వస్తుంది. 'ప్యూరిటీ' వున్నప్పుడే 'డివినిటీ' వస్తుంది. కనుక, మొట్టమొదట 'యూనిటీ', 'ప్యూరిటీ'లను పెంచుకోండి. అప్పుడే 'డివినిటీ'ని

అందుకోగలరు. మీరందరూ ఏకమైపోవాలి. అందరూ ఏక భక్తితో వుండాలి. నేను చూచేది పుస్తకము కాదు, మస్తకాన్ని చూస్తాను. రాజన్ ఎన్నో పుస్తకాలు ప్రింటు చేసి నా దగ్గరికి తీసుకొని వస్తుంటాడు. కాని, పుస్తకములను చూస్తే నాకంత తృప్తి లేదు. వ్రాసినవారి మస్తకము ఎట్టిది అనేది నేను చూస్తాను. పాత్ర పరిశుద్ధంగా వున్నప్పుడే అందులో వండిన పదార్థము రుచిగా వుంటుంది. కనుక, మొట్టమొదట మీ 'హార్ట్' పరిశుద్ధం కావాలి. ఏమి జరిగినప్పటికీ, ఎన్ని మారినప్పటికీ 'హార్ట్' మాత్రము మారకూడదు. 'హార్ట్' అంటే 'ఫిజికల్ హార్ట్' కాదు. నేను చెప్పేది 'స్పిరిచ్యువల్ హార్ట్' గురించి. అదే దైవముయొక్క నివాసము. ఆ దైవమునే 'ఆత్మ' అని పిలుస్తారు. దైవమునకు ఒక ప్రత్యేకమైన రూపము లేదు. కాని, ఎక్కడ చూచినా వుంటున్నాడు. నీ లోపల, నీ వెలుపల, నీ పైన, నీ క్రింద ఎక్కడ చూచినా వున్నది ఆత్మయే. కాని, కోరికలనే మేఘాలు వచ్చి చేరటం చేత నీకు ఆత్మ కనిపించటం లేదు.

_దైవాన్ని మరచి చేసేదంతా వ్యర్థమే_

ఆకాశంలో మేఘాలు అడ్డు వచ్చినప్పుడు చంద్రుడు కనిపించడు. అంతమాత్రమున చంద్రుడు లేడని చెప్పకూడదు. చంద్రుడు వున్నాడు. నీవు చూడాలంటే కొంచెం ఓపిక పట్టు. మేఘములు కదలిపోతూనే చంద్రుడు కనిపిస్తాడు. 'చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత' మన హృదయమనే ఆకాశములో ఆత్మ అనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. మన 'థాట్స్' 'డిజైర్స్' వచ్చి 'క్లౌడ్స్' మాదిరి దీనిని కప్పివేస్తుంటాయి. కొన్నికొన్ని సీజన్లలలో 'క్లౌడ్స్' చాలా దట్టంగా వస్తుంటాయి. అప్పుడు చంద్రుడు అసలు కనిపించనే కనిపించడు. అదేవిధముగనే, ప్రతి ఒక్కరి హృదయమందు దైవమున్నాడు. నీ ఆలోచనలు, కోరికలు అనే మేఘాలు చాలా దట్టంగా వుండటం చేత నీకు దైవము కనిపించటం లేదు. కనుక, కోరికలను నీవు కంట్రోలు చేసుకోవాలి. కోరికలే ఆత్మను కప్పివేస్తున్నాయి. దీనినే వేదాంత పరిభాషలో 'వైరాగ్యము' అన్నారు. దినదినానికీ మన దేహము పెరుగుతూ వున్నది. కాని, వయస్సు మాత్రం తరుగుతూ వున్నది. కనుక, Less luggage, more comfort make travel a pleasure. కోరికలనే లగేజిని తగ్గించుకుంటే జీవిత ప్రయాణం ఎంతైనా హాయిగా వుంటుంది. ఏ గ్రంథాలు చదివినా, ఏ పవిత్రమైన చరిత్రలు విన్నా మీరు కోరికలను తగ్గించుకొనకపోతే ప్రయోజనం లేదు. అయితే, ప్రతి ఒక్కరికీ కోరికలు వుంటాయి. కాని, కొన్ని ఉపయోగం వున్నవి వుంటాయి, కొన్ని ఉపయోగం లేనివి వుంటాయి. అసలు తెల్లవారి లేవటమే మీరు కోరికలతో లేస్తున్నారు.

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

దైవాన్ని మరచి మనము ఏమిచేసినా అది వ్యర్థమే. మొట్టమొదట దైవాన్ని లక్ష్యములో పెట్టుకోవాలి. ఎన్ని కష్టనష్టములు వచ్చినప్పటికీ, ఎవరెన్ని చేసినప్పటికీ మనం దైవాన్ని వదలకూడదు. ఆవిధమైన నిశ్చలమైన, నిర్మలమైన భక్తి మనలో నిలచినప్పుడే మనము భక్తులమౌతాము. అట్లుకాకుండా మనస్సు చంచలంగా వుంటే నీవు భక్తుడవే కావు. భక్తి అనేది సముద్రము వలె ఎల్లప్పుడూ తగ్గిపోకుండా వుండాలి. ఒకవైపున నీరు ఆవిరైపోతుంది, మరొ వైపున నదులు వచ్చి చేరిపోతుంటాయి. కనుక, సముద్రము ఎల్లప్పుడూ పెచ్చుతగ్గులు లేకుండా ఒకేవిధంగా వుంటుంది. మన హృదయమును ఒక సముద్రంగా పెట్టుకోవాలి. కోరికలనే అలలచేత దానియందు అలజడి సృష్టించకూడదు. అలలు ఎన్ని వచ్చినప్పటికీ సముద్రము సముద్రముగానే వుంటుంది. అదేవిధంగా, మీ హృదయాన్ని ఎల్లప్పుడూ పవిత్రమైన రీతిగా, నిర్మలమైన రీతిగా, నిస్స్వార్థమైన రీతిగా వుంచుకొని జీవించాలి.

_'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావముతో పని చేయటమే నిజమైన భక్తి_

మా రాజన్ చాలా కష్టపడి పనిచేస్తున్నాడు. పుస్తకాల విషయంలో ఎన్నెన్నో మార్పులు చేయాలని ప్రయత్నిస్తున్నాడు. 80వ బర్త్‌డేకి చాలా మంచి పుస్తకాలు తయారుచేశారు. అయితే, ఏవిధమైన ఆశలూ పెట్టుకోవద్దు. ఏ ఒక్కటి చేసినా

దైవార్పిత భావంతో చేయాలి. 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావంతో పనిచేయాలి. అదే నిజమైన భక్తి. 'ఇది నా పని, ఇది స్వామి పని, ఇది మనందరి పని, ఇది పబ్లిక్ పని' అనే భేదం పెట్టుకోవద్దు. అందరి పనీ ఒక్క దైవానిదే. పుస్తకం వ్రాసినవాడు, ప్రింటు చేసినవాడు, చదివేవాడు అందరూ ఒక్కటే. కనుక, మీరు వ్యత్యాసాలు పాటించకండి. అప్పుడే నిజమైన, స్థిరమైన భక్తి కుదురుతుంది. భక్తి నిశ్చలంగా వుండాలేగాని ఊఁఅకే చంచలంగా వుంటే ప్రయోజనం లేదు. చంచలమైన మనస్సు వల్ల ఏమి జరుగుతుంది? ఫలితంలో కూడా మార్పు కలుగుతుంది. కనుక, మనస్సులో చంచలత్వానికి చోటివ్వకూడదు. కోరికలు, ఆలోచనలు వస్తాయి. అక్కడ మనము

విచక్షణ ఉపయోగించాలి. 'ఇది మంచిదా, చెడ్డదా? ఇది తప్పా, ఒప్పా?' అని విచారణ చేయాలి. 'అది ఒప్పు' అని నీ అంతరాత్మ అన్నప్పుడు నీవు దానిని తప్పక ఆచరించు. అంతరాత్మ ఇచ్చిన సిగ్నెల్‌కు విరుద్ధంగా మనము ఎప్పుడూ నడుచుకోకూడదు. నీ అంతరాత్మకు 'ఇది రైటు' అని తోచినప్పుడు, ఎవరు ఏమనుకొన్నా సరే, దానిని నీవు అనుసరించు. చెప్పేవాళ్ళు చెబుతుంటారు. కాని, మన మనస్సు ఎప్పుడూ స్థిరంగా వుండాలి.

సత్యధర్మాలను లక్ష్యములో పెట్టుకో

గ్రంథపరిచయం గొప్పతనం కాదు. గ్రంథములలో వున్న గంధాన్ని ముఖ్యంగా తీసుకోవాలి. మేటర్ లేకపోతే పుస్తకమే కాదు. విషయమే లేకపోతే అది మేటరే కాదు. ఆ విష?ని ఎలాంటిదిగా వుండాలి? అది హృదయానికి సంబంధించిన సబ్జెక్టుగా వుండాలి. కనుక, వ్రాసే వారు మంచి గ్రంథాలు వ్రాయాలి. పిచ్చిపిచ్చివన్నీ మనము ప్రింటు చేయకూడదు. లౌకికమైన కోరికలకు సంబంధించిన పుస్తకాలు బయట ఎన్నో ప్రింటు చేస్తున్నారు. కాని, అవి ఏమైపోతున్నాయి? ఎవ్వరూ వాటికి విలువ ఇవ్వటం లేదు. హృదయానికి హత్తుకొనే విషయములే సత్యమైనవి. సత్యాన్ని, ధర్మాన్ని వదలకుండా మన కర్మలను మనము ఆచరించాలి. సత్య, ధర్మములు రెండూ వేరువేరు కాదు. 'సత్యాన్నాస్తి పరోధర్మః' సత్యము, దర్మము రెండూ బింబప్రతిబింబాలే. ధర్మమే లేకపోతే సత్యమే లేదు. ఈ రెండూ వుంటే మనము ఎంతైనా సాధిస్తాము. ఈ రెండింటినీ లక్ష్యములో పెట్టుకొన్నప్పుడు మనము జీవితగమ్యాన్ని చేరుతాము. ఈనాడు నేను అధికంగా చెప్పటానికి వీల్లేదు. నేను చెప్పదలచుకొన్నది కేవలం గ్రంథములకు సంబంధంచిన విషయమేగాని మరొకటి కాదు. మీరందరూ విన్నారు. ఎన్నో పుస్తకాలు చదివారు. ఇప్పటినుండైనా విన్నటువంటి విషయాన్ని మీ హృదయంలో పెట్టుకొని దాని ప్రకారం నడచుకోటానికి ప్రయత్నించండి.